పునర్ముద్రిత లఘు గ్రంథాలు

కవిబ్రహ్మ

'కవిపాదుషా' పువ్వాడ శేషగిరిరావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

పునర్ముద్రిత లఘు గ్రంథాలు

కవిబ్రహ్మ

'కవిపాదుషా' పువ్వాడ శేషగిరిరావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం

మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం

హైదరాబాద్

Kavi Brahma
– 'Kavipaadusha' Puvvada Sheshagiri Rao

కవిబ్రహ్మ

రచయిత : 'కవిపాదుషా' పువ్వాడ శేషగిరిరావు

ISBN : **81-86073-325-7**

ప్రచురణ నెం : **462**

ప్రతులు : **5000**

ప్రథమ ముద్రణ : **ఏప్రిల్, 1975**

ద్వితీయ ముద్రణ : **డిసెంబర్, 2012**

వెల : **రూ. 20/-**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
లలితకళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాదు - 500 004.

ముద్రణ : **సాయిలిఖిత ప్రింటర్స్**, ఖైరతాబాద్, హైదరాబాద్.

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)

ముఖ్యమంత్రి

V. VASANT KUMAR, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే “ప్రపంచ తెలుగు మహాసభల” నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా

సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ, వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

(వట్టి వసంతకుమార్)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వవిద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వవిద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 1975 నాటి మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముద్రించిన పువ్వాడ శేషగిరి రావు గారి “కవిబ్రహ్మ” అనే గ్రంథాన్ని పునర్ముద్రిస్తున్నాం. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న ఆచార్య సి.మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

Blank Page

ముందుమాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వసమయం ఆసన్నమవుతున్నది. ప్రపచంలోని తెలుగువారి ప్రతినిధులనందరినీ ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది, రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టముకాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్ధికి చెందిన శాతవాహన రాజుల కాలంనుంచి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగం నుంచి ఇటీవల బ్రిటీష్ సామ్రాజ్య పరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్లడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్కృతి సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదిక మీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషిని గూర్చి చర్చించి, నిర్ణయించు కోవడానికి, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖం చేసి మన సాంస్కృతిక సంబంధాలను ధృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారంరోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాల నుంచీ, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థల నుంచీ విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి,

వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాల నుంచి ప్రస్ఫుటం చేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రాహాలయాన్ని (మ్యూజియంను) స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూత మవుతుంది. తెలుగువారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకు వచ్చిన అకాడమీల అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగు వారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమేకాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు,
ప్రపంచ తెలుగు మహాసభలు

పరిచయము

సహస్రాబ్దాలుగా ప్రవర్ధమానమగుచున్న తెలుగు సంస్కృతిని తెలుగు దేశపు నలుచెరగుల పరిమితముచేయు సంకల్పముతో 1975వ సంవత్సరమును తెలుగు సాంస్కృతిక సంవత్సరముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రకటించినది. అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహింపజేయుటయేగాక, ప్రపంచములోని వివిధ దేశాలలో నివసించుచున్న తెలుగువారి సాంస్కృతిక ప్రతినిధులందరును ఒకచోట సమావేశమగు వసతిని కల్పించుటకై 1975, ఏప్రిల్ 12 (తెలుగు ఉగాది) మొదలుగ ప్రపంచ తెలుగు మహాసభ హైదరాబాదున జరుగునటుల ప్రభుత్వము నిర్ణయించినది. అందుకు ఒక ఆహ్వాన సంఘము ఏర్పాటయినది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ జలగం వెంగళరావుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు, విద్యాశాఖామంత్రి మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు దాన్ని కార్యనిర్వాహకాధ్యాక్షులు, ఆర్థిక మంత్రి మాన్యశ్రీ పిడతల రంగారెడ్డిగారు ఆర్థిక, సంస్థా కార్యక్రమాల సమన్వయ సంఘాల అధ్యక్షులు.

ఆ సంఘము, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వచ్చువారికి తెలుగుజాతి సాంస్కృతిక వైభవమును తెలియజేయుటకు అనువుగ ఆంధ్రభాషా, సాహిత్య, కళా చరిత్రాదికములను గురించి ఉత్తమములు, ప్రామాణికములునగు కొన్ని లఘు గ్రంథములను ప్రకటించవలెనని సంకల్పించి, ఆ కార్యనిర్వహణకై 44 మంది సభ్యులుకల ఒక విద్వత్ సంఘమును, శ్రీ నూకల నరోత్తమరెడ్డి గారి అధ్యక్షతన నియమించినది. ఆ విద్వత్ సంఘము ఆ లఘు గ్రంథముల వస్తువుల నిర్దేశించి వాని రచనకై ఆయా రంగములందు పేరుగనిన ప్రముఖులను రచయితలుగ యెన్ను కొనినది. ఈ విధముగ సిద్ధమైన గ్రంథములలో భాషా సాహిత్య, చారిత్రక విషయములకు సంబంధించిన వానిని ప్రకటించు బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వహింపవలసినదిగ ప్రపంచ తెలుగు మహాసభాకార్యనిర్వాహకాధ్యక్షులు మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు అకాడమీని కోరగా, మహాసభా సఫలతకొరకై కృషి చేయు సంకల్పముతో ఈ బాధ్యతను వహించుటకు అకాడమీ సంతోషముతో అంగీకరించింది.

ఆ విధముగ ప్రకటింపబడిన గ్రంథశ్రేణిలో ఈ **'కవిబ్రహ్మ' అను గ్రంథమును రచించిన 'కవిపాదుషా' పువ్వాడ శేషగిరిరావుగారు** ఆంధ్రపాఠక లోకమునకు సుపరిచితులు. వారికి మేము కృతజ్ఞతా బద్ధులము. గ్రంథమును నిర్దుష్టముగ, చక్కగ ముద్రించిన బి.వి.ఆర్. బాల్‌రెడ్డి అండ్ కంపెనీ వారికి మా కృతజ్ఞతలు.

హైదరాబాద్
21-3-1975

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

కవిబ్రహ్మ

బిరుదములు

తిక్కనా మాత్యునకు మూఁడు గుఱుతు నామములున్నవి. 1. ఉభయ కవి మిత్రుడు, 2. సోమయాజి, 3. కవిబ్రహ్మ. అతడు గంటము పట్టిన దాది ఉభయకవిమిత్రుడే! అనగా మార్గదేశి కవులకు మిత్రుడన్నమాట! ఆ తరువాయి యజ్ఞము చేసినదాది అతడు తిక్కన సోమయాజి. తొలి కృతినాటి కతడు తిక్కన నామధేయుడు మాత్రమే! ఇక, 'కవిబ్రహ్మ' గుఱుతు నామము తానే యెఱుఁగనిది. నూఱేండ్ల తరువాతి యెఱ్ఱన నోట, అది ఉత్ప్రేక్షయై పుట్టి, ఆంధ్రావలి నోట స్వభావోక్తిగ గట్టిపడ్డది. శ్రీనాథ పినవీరభద్రులనోట అదియును లేదు.

తిక్కన, సోమయాజి కాకమున్నే, ఆయన నోట నూడిపడ్డ అంతేవాసి, అభినవ దండి, కేతన తన దశకుమారచరిత్ర కృతిలో "ఉభయకవిమిత్ర నామము త్రిభువనముల నెగడిన"దని స్పష్టపఱచెను. నరునకు దత్త్వోపదేశకుడు శౌరి. తనకు కవితాతత్త్వోపదేశకుడు తిక్కనయు 'శౌరి'యని తేటపఱచెనే గాని 'కవిబ్రహ్మ'యని వాకొనలేదు. ఆ కేతనయే ఉత్తరోత్తర కాలమున తన 'ఆంధ్రభాషాభూషణము'లో యథాపూర్వము బుధారాధన విరాజియనియు, క్రొత్తగా సోమయాజియు అనియు, తిక్కనగారి ప్రసక్తి దెచ్చెనేగాని అందును ఆయన కవిబ్రహ్మయని సూచింపలేదు. తిక్కనామాత్యునకు సమకాలికుడు, సమతాకాంక్షి, పరోక్ష శిష్యుడు! కవితాసనాథుడు అగు నాచన సోమనాధుడును, తిక్కన 'సోమయాజి' యనియు 'శ్రీమదుభయ కవిమిత్రు' డనియు దన యుత్తరహరివంశమున నుట్టంకిచెనే కాని తిక్కనకు కవిబ్రహ్మ బిరుదము తలసూపనీయలేదు. మఱి, నూఱేండ్లు కడచిన తరువాతి ఎఱ్ఱన తిక్కన్నను 'కవిబ్రహ్మ' నా వినుతించెను. 'కవిబ్రహ్మ' అనెడి గుఱుతు నామము తొలిసారిగా వెలువడ్డది అప్పుడే!

"తన కావించిన సృష్టి తక్కొరుల చేతంగాదు నా, నే ముఖం
బునఁ దాఁ బల్కిన పల్కులు - ఆగమములై పొల్పొందు నా, వాణి న
త్తను నీతం డొకరుండ నాఁ జను మహత్త్వాప్తి న్ 'కవిబ్రహ్మ" నా,
వినుతింతు న్ కవి తిక్కయజ్వను : ...."

ఈ పద్దెముప నాలుగు 'నాఁ'లున్నవి. మొదటి మూడు 'నాఁ' లు - ఉత్ప్రేక్షావాచకములై 'కవిబ్రహ్మనాఁ" అను నాల్గవ 'నాఁ' బిరుదు మెట్లు కాగలదు?

అదియు ఉత్ప్రేక్షావాచకమే! అప్పటికే అదియొక బిరుదమై యున్నచో, 'నా ౯'ఎందులకు?తదాది, ఆ యుత్ప్రేక్ష స్వభావోక్తియై బిరుదమైనది. సార్ధకములైనవే బిరుదములు. "ఆంధ్రావలి మోదముం బొరసిన జాలు, నా కృతి కృతార్థ" మన్నారు తిక్కనగారు. ఆ ఆంధ్రావలి మోదమే ఆయనను కవిబ్రహ్మగా నిరూపించినది. నిజము నిలుకడమీద దేలినది.

ప్రసంగవశముననే కాక తిక్కనగారి బ్రహ్మత్వ నిరూపణకై ఈ పద్దెమునందలి "వాణి నత్తను నీతండొకరుండ "నా౯" అన్న వాక్యభాగమునకు ప్రతిపదార్థము వివరించి సమన్వయింపవలసి యున్నది. ఇందు 'నత్తను' సమన్వయక్లిష్టమని కొందఱి మతము. చిక్కు విడదీయలేక కొందరు తాళపత్ర మూలాక్షరములు తుడిచి ఆ స్థానమున అధికారము లేని తమ తమ కొలదుల పదము లదుకుట శోచనీయము: కవిత్రయ పదములు యథాతథ సేవ్యములు. ఆయీ పదస్పర్శలచే బద్యము కళంకితము చేయుట అపచారము. వేదమున స్వరము తప్పినను, పంచమవేదమునఁ బదము తప్పినను తత్జ్ఞులు సహింపరు. ఉన్నదే ఓపిన కొలది యన్వయించుకొని మిన్నకుండవలె! మన పదము చొనుపుటకు మనము తిక్కనలమా ఎఱ్ఱనలమా?

నత్తు = దే.ఉ.క్రియ. తడఁబడుచు మాటాడు
నత్తి = తడబడుచు మాటాడు వ్యాధివిశేషము శబ్ద రత్నాకరము
నత్తివాడు = నత్తిగలవాడు? ఆక్షేపకుడు

"వాణి వాణినే 'నత్తు' అని త్రోసిపుచ్చి సరిదిద్దగల అపరబ్రహ్మ కవిబ్రహ్మ. వాణీ! నీ వాణి నత్తిమాట, నా వాక్కే పంచమ వేద ఋక్కు సుమా!" అని కవిబ్రహ్మ సరస్వతిని ఉల్లసమాడు నట! 'నత్తన ౯' అను మూడక్కరములలో ఎఱ్ఱన ఎంతటి అతిశయోక్తి గుప్పిలించినాడు! "వాణి౯ + నత్తు + అన౯ + ఈతండు + ఒకరుండె (కలడు) +నా ౯ " అన్న పద విభాగము కవిహృదయమై యుండవలె! ఇందు అతిశయోక్త్యనుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారము కలదు. ఇంతకును, జెప్పవచ్చిన దేమన, 'కవిబ్రహ్మ' అనునది తిక్కనకు బిరుదుకాదు. ఆయనకు ఉభయకవిమిత్రుఁడన్నదే త్రిభువనముల నెగడిన బిరుదము,

ఇదియే నన్నయభట్టారక విషయమునను వర్తించును. నన్నయ 'ఆదికవి' యన్నచో అది బిరుదు కాదు. 'ఆది' అన్నది కాల సంబంధి. బిరుదము సామర్థ్య సంబంధి. నన్నయ వాగనుశాసను డన్నచో అది బిరుదగును. శాసించునది శాస్త్రము. 'ఆంధ్రశబ్దచింతామణి' కర్తృత్వ మా బిరుదమునకు మూలము కావచ్చు.

ఇది యిట్లుండె, ప్రకృతమునకు వత్తము.

మూర్తి వైభవము

నేతి మార్గాన్వేషణము లనుమాన ప్రమాణాములు. దేశ కాల రాజశాస నాధారములు చరిత్రజ్ఞుల చెరలాటలు; రసపిపాసువుల కవి ఆలస్యావరోధములు, అనవసర కాలక్షేపములును. మఱి, తత్త్వ వివక్షలును శాస్త్ర సూత్ర సమన్వయములును, అనువాదానుసారానుకార విచిక్సిలును పండితైక సమ్మోదములు. మఱేవి సముచితములు, సమంజసములు? ఏవి ప్రత్యక్ష ప్రమాణములు? సృష్టికి సందర్శన కందళిత హృదయ స్పందనమును, ప్రతిసృష్టికి అనుస్యూత రసప్రసారవైవశ్యమును బ్రత్యక్ష ప్రమాణములు; అవే సముచితములు, సమంజసములు. సృష్టికర్త చతుర్వేద చతుర్ముఖుడగుచో ప్రతిసృజనా వినోదిశబ్దార్థ రసధ్వని ముఖుడు కావలె? అతడే తిక్కయజ్వ, కవిబ్రహ్మ! చెయిచాచని మనుమసిద్ధికిఁ దిక్కనామాత్యుడు రాజ్యప్రదాత యయ్యెను. "ఏ నిన్ను మామయనియెదు దీనికిఁ దగనిమ్ము భారతీకన్యక" అని చెయిచాచిన మనుమసిద్ధి ప్రభునకు దిక్కయజ్వ నిర్వచనోత్తర రామాయణ కృతిప్రదాతయయ్యెను. అంతియేనా? "కృతిపతిత్వ మర్థించి వచ్చితి తిక్కశర్మ!" అని సన్నిధిచేసిన సర్వేశ్వరునకు కవిబ్రహ్మ ఆంధ్ర మహాభారతేతిహాస కృతిప్రదాతయయ్యెను. ప్రభువు మొదలు పరమేశ్వర పర్యంతము తిక్కయజ్వనుకృతిప్రదాన మడుగ బాల్పడినవారే! ఆ మహామంత్రికెంతరాజసము!

విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు, విజ్ఞానసం
పద్విఖ్యాతుడు సంయమిప్రకర సంభావ్యానుభావుండు

కృష్ణ ద్వైపాయనుడు కవిబ్రహ్మకు ఁబితృపాదులు.

"ఆదరణీయ సార వివిధార్థగతి స్ఫురణమ్ము గల్గి య
ష్టాదశ పర్వనిర్వహణ సంభృతమై"న భారతము నం దాది

తొడంగి, మూడుపర్వము లాంధ్రీకరించిన నన్నయ తిక్కయజ్వకన్నయ. ఇట్టి అన్నయ, నన్నయను అక్షరరూపమున దిక్కయజ్వ రెండు శతాబ్దములకు జూడగలిగెను. ఇంకొక శతాబ్దమునకు బుట్టనున్న తమ్ముని నెఱ్ఱన్నను తానెట్లెఱుగ గలఁడు? ఈ ముప్వురు మూర్తులలో దిక్కయజ్వ కాలక్రమమున ద్వితీయుడయ్యు కవితాసృష్టిలో అద్వితీయుడని నాఁడు, నేఁడు, ఆంధ్రమహాభారతము చాటిచెప్పుచున్నది.

నన్నయకుఁ గవితాశిష్యులున్నారో లేరో! కాని కవిబ్రహ్మ శిష్యులను సృజించెనట! లబ్ధప్రతిష్ఠుడు, గురుపదాంకిత నిజకావ్య విస్రబ్ధ కీర్తిగరిష్ఠుడునైన

'అభినవదండి' కేతన కవిబ్రహ్మ శిష్యకోటిలో పరాంకోటి నందుకొన్న కవీశ్వరుడు. ఆయన హృదయపీఠమున నెక్కొన్న తిక్కయజ్వ అఖండ మూర్తియిదిగో!

సుకవీంద్ర బృంద రక్షకు డెవ్వడనిన వీ
 డను నాలుకకు దొడవైన వాడు,
చిత్తనిత్యస్థిత శివుడెవ్వడనిన వీ
 డను శబ్దమున కర్థమైనవాడు
దశదిశా విశ్రాంత యశుడెవ్వడనిని వీ
 డని చెప్పుటకుఁ బాత్రమైన వాడు
సకలవిద్యా కళా చణు డెవ్వడనిన వీ
 డని చూపుటకు గుఱియైనవాడు

మనుమసిద్ధి మహీశ సమస్తరాజ్య
భార ధౌరేయుఁ డభిరూప భావభవుడు
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుడు
దీన జనతా నిధానమ్ము తిక్కశౌరి.

కవితసెప్పి యుభయ కవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతడు మెచ్చ
బరగ దశకుమార చరితమ్ము జెప్పిన
ప్రోడ నన్ను వేఱ బొగడ నేల?

అని ముఖ్యముగ గవి బ్రహ్మ అంతస్స్వరూపమును,
"*కనకగిరితటీ సంకాశ వక్షఃస్థలీ భాగుఁడు,
*శ్రీ రమణీర మణీయ మహొూరస్థలీ విజిత
 కాంచనోర్వీధర విస్తారిత బలుండు,
* కల్పక పరాభవకరణ ధురీణ దీర్ఘ బాహుండు,
* జలజ సుభగ నేత్రుండు,
* వియన్మణి తేజుడు – అతి దినకర తేజుడు,
 నిజప్రభా దూషిత వాసరేశుడు"

- అని కవిబ్రహ్మ బహిస్సౌందర్యమును, అభివర్ణించి, తన దశకుమార చరిత్రనంకితమిచ్చిన అంతేవాసి కేతనామాత్యుని పలుకు పలుకు మనకు ప్రత్యక్ష ప్రమాణము. ఇట్టి తిక్కనామాత్యుని మూర్తి, అఖండ కీర్తిస్ఫూర్తి, మన యూహ కందరానివి. ఒక్క మొగిని గంటమెత్తి కవిబ్రహ్మ ఆంధ్రావలి మోదముం బొరయ బలికిన పంచమవేదము పదునేను పర్వములును, యుగ కర్తృత్వమునకే గాక, సకలాంధ్రవాఙ్మయ సృష్టికర్తృత్వమునకు అనన్య యోగ్యమగు పట్టము కట్టినవి. అతని వాక్కే బుక్కు, అతని మెప్పే ఒప్పు. ఉభయకవిమిత్రుని యభయప్రదానమే యుగకర్తలకు శ్రీరామరక్ష! రసాభ్యుచిత ప్రబంధకర్తల కమృతభిక్ష! 'వాక్రుత్తుఁదిక్కయజ్వప్రకారము రసాభ్యుచిత బంధముగ నొక్కొక్క మాటు' అని కవిసార్వభౌముడు శ్రీనాథుడే రసపోషణకు దిక్కయజ్వను ఆదర్శముగ నిలుపుకొనియెను. సమకాలిక మహాకవులను శాసించి, ప్రతివాద భయంకర డిండిమభట్టారకుని కంచుఢక్క పగిలించి యుగకర్తయైన శ్రీనాథునకు తిక్కన ఆదర్శమూర్తియట! మఱేమనవలె! యుగకర్తలకే కనువెలుగనవలె! ఒక్క మాటలో తిక్కన ఆంధ్ర వాఙ్మయమునకే దిక్కనవలె!

కవిబ్రహ్మ కావ్యపరిపాక మెవరు తాకినను అది స్థాలీపులాకమే! సముద్రతీరమును దరిసి 'పారమెఱిగితి' నన్నట్లే! దొరికినంతలోఁ దొలి రచనమని పించుకొన్న నిర్వచనోత్తర రామాయణము నించుక స్పృశించి చూతుము.

ఉత్తర రామాయణము: నిర్వచన రచన

పద్యకళ రసపుష్కల. గద్య మంత కానేరదు. పద్యగద్య సమ్మిశ్రము చంపువు. నన్నయాదుల భారతాదులు చంపువులే! సంస్కృత మహాకవుల చంపువులు క్వాచిత్కములు. మఱి తెలుఁగున చంపువులే సర్వసాధారణములై యున్నవి. ఆ కారణమునఁ దిక్కనామాత్యుడు తన ఉత్తర రామాయణ రచన నిర్వచనమై సాగుటలోని ప్రౌఢిమ యెల్గెత్తి చెప్పవలసి వచ్చినది.

"వచనము లేకయు వర్ణన
రచియింపగఁ గొంతవచ్చుఁ బ్రౌఢులకే!"

ఈ ప్రోఢ నియమ మంతటితో ఆగలేదు.

తెలుగు కవిత్వము చెప్పం
దలచిన కవి యర్థమునకుఁదగియుండెడి మా
టలు గొని వళులుం బ్రాసం
బులు నిలుపక యొగిని బులిమి పుచ్చుట చేదురే!

తెలుగున వృత్తములే కాక జాత్యుపజాతులు లక్షణలక్షితములై ప్రబలినవి. ఆయీ 'వళులుం బ్రాసల' చిక్కులు అభ్యాసవశమున దీఱవలె గాని కేవల ప్రతిభావ్యుత్పత్తులు శరణ్యములు కానేరవు. అదిలేనిచో దిక్కులుచూచి చూచి పడికట్టు రాళ్ళకుఁబాల్పడ వలసినదే! అంతేనా!

అలవడ సంస్కృత శబ్దము
తెలుగు బడి విశేషణంబు తేటపడంగా
బలుకు నెడ లింగవచనం
బులు భేదింపమికిఁ మెచ్చు బుధజనము కృతి

అందువలననే

'తెలుగు తెలుఁగని యద్దాన దిగుటెగాని
సంస్కృతమ్మున కన్న కష్టమ్ము హెచ్చని

తిరుపతి వేంకట కవులు ఆనుభవజ్ఞులై ముదలించుట.

ఇన్ని యసిధారావ్రతముల గడితేఱిన తిక్కనామాత్యుడే "ఆపరితోషా ద్విదుషామ్ నసాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్! బలవదపి శిక్షితానాం ఆత్మన్యప్రత్యయం చేతః!!" అన్న కవికులగురువున కన్నయై అడుగడుగున బుధజనామోద మర్థించినాడు.

"ఆర్యు లొప్పిద మనరే"
"మెచ్చు బుధజనము కృతిన్"
"సూరుల కివ్విధ మింపు నింపదే"
వేఱ నాకృతి గణములు వేయునేల?"
కావ్యంబు సరసులైన కవుల చెవులకు
నెక్కినగాని నమ్మడెందు బరిణతి
కలుగు కవీశ్వరుండు"

అని చెప్పుకొనుటకు వెనుకాడలేదు– కానున్న కవిబ్రహ్మ! ఇంతటి బుధజనతా విధేయతా భూషణుడు తిక్కనార్యుడే ఎంతటి ఆత్మవిశ్వాస బంధురుడో, ఈ కావ్యావతారికలోనే పరికింతము.

"ఏ నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుడన్, కళావిదుడ, నాపస్తంబ సూత్రుండ, గౌ
తమగోత్రుండ, మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక శీలుండ, న
న్నమకుం గొమ్మన మంత్రికిన్ సుతుడఁ దిక్కాంకుండ, సమ్మాన్యుడన్"

అనియు,

జాత్యము గామి నొప్పయిన సంస్కృతమెయ్యెడ జొన్ప; వాక్యసాం
గత్యము సేయుచోనయిన గద్యము తోడుగఁ జెప్పి పెట్ట; దౌ
ర్గత్యము దోఁపఁ బ్రాసము ప్రకారము వేఱగు నక్షరంబులన్
శ్రుత్యనురూపముంచు నిడ; సూరుల కివ్విధ మింపు నింపదే!

అనంతర మప్పకవీత్యాదులు ఒప్పని చెప్పిన, చెప్పని వళిప్రాసము లెన్ని పరిహరించి ఎంత నిగ్రహించి తిక్కన కవిబ్రహ్మయైనాడో తజ్ఞులకే యెఱుక! ఎఱుగని వారికి పై పద్దెములే అద్దములు. ఆయా నియమశపథములు నిర్వచనోత్తర రామాయణము నందే కాదు, ఉత్తరోత్తరమున మహాంధ్రభారతము పదునేను పర్వములందును నిరూపిత ములై సార్థకములైనవి. జిజ్ఞాసువులకవి విజ్ఞాన కోశములు, ప్రజ్ఞానవాసములు.

కవితాసృష్టి

పురాణములు నీతి సూత్రములు; ఇతిహాసములు కథన మాత్రములు; ప్రబంధములు రస పాత్రములు; నాటకములు పాత్రచిత్రములు. ఆయా చతుర్ముఖోజ్జ్వల రూపరేఖా సౌందర్యసౌరభ్యము లాహరించిన అమరశిల్పి, ధర్మాద్వైత భావనానల్ప కల్పనలతో విహరించిన చిదానంద శిల్పి, కవిబ్రహ్మ.

కవిబ్రహ్మ శబ్దసృష్టి అణ్వాది బ్రహ్మసృష్టి కినుమిక్కిలి రమ్యతరమై, రసమయమై, యక్షరమై, యనుపాధికమై శాశ్వతానందమయ విశ్వవిహార నిర్వృతి నందీయ గంకణము కట్టుకొన్నది. ఆదిభౌతికాధ్యాత్మిక తత్త్వదిదృక్షకు కవిబ్రహ్మ ప్రత్యక్షరమును బరమ ప్రమాణము. ఒక్కొక్క శబ్దము మొదలుగ సమగ్ర కావ్య నిర్వహణమున ఫలశ్రుతి వఱకును, అవతారికమొదలా శ్వాసాంత గద్యముల వఱకును తిక్కనామాత్య భారతీసతీ మంజు మంజీరోచ్చలద్ఘంటికా వ్రాత ఘలంఘలారావ ప్రారంభ సంరంభము లెట్టి

యను భావోన్మీలనము చేయునో, యనుభూత రసభావ పరవశుడైన రసిక శిఖామణియే పసిగట్ట గలడు. చేత గంటము పట్టి శ్రీయస గౌరినా బరగుచెల్వకు జిత్తము పల్లవింప భద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూపాయ నమశ్శివాయ యని తిక్కన సోమయాజి పుడిసిలించి విడిచిన అనర్గళ కవితాలహరిలోని పోకడలు, ఎత్తుగడలు, పదప్రయోగములో, అర్థస్ఫూర్తిలో ఒదుగు మదుగులు గుఱితింప నలవికానివి.

అలతి యలతి తెలుగు పలుకుల గిలుకరింపు తొలకరింపులో ననిచి తేకతేఱ వికసించిన క్రొవ్విరుల దర మెఱిగి గుఱు తెఱిగి యేరికొనగల నేరుపు తీరుపు లుండవలె గాని అల్లిబిల్లిగ నల్లుకొన్న తీవజొంపములనెట ముట్టినసుమై పులకరించి జలదరించును. విభక్తులదుకుటలోని వింతవింత విన్నాణములు, పదముల పాదముల విఱుపులో, మలుపులో – తేకువలో కాకువులో – క్రొత్త క్రొత్త పోడుములు, తిక్కన పలుకుబడికి మేలి గుఱుతులు. పదశిల్పము, వాక్యనిర్మాణము, భావనాపటిమ, పాత్ర సాక్షాత్కారము, రూప సౌందర్యము, ప్రకృతి తాదాత్మ్యము, మానవ ప్రకృతి పరిశీలనము, సన్నివేశ సంఘనటము, అంగాంగి భావప్రమాణ నిరూపణము, కథానుసంధానము, శబ్దధ్వని, అర్థధ్వని, ఇత్యాదిగా విశ్వరూప ప్రదర్శన సాభాగ్యమంతయు దరంగపరంపరలతోఁ దురంగలించి శాబ్దజ్యోతి రుద్యోదిత ప్రభలలో తిక్కన కవితా జగత్తు సాక్షాత్కరించును.

కవిబ్రహ్మ పద్యకళ

తిక్కన పద్యములలోని ఉక్తివైశిష్ట్యము, యుక్తివైభవము, వాక్య నిర్మాణము, భావగాంభీర్యము ఎవరికి అబ్బునది కాదు; ఎల్లరకు అందునది కాదు. వీర రసపోషణమున సకలకవులును సమాసభూయిష్ఠ సంస్కృతబాష వాడుట కలదు. కాని, ఒండు రెండక్కరముల నదిమిన పదములను, కుదిలించి విదిలించి, యదలించిన తెలుగు పోకడలతో వీర రసము నినుమడించి సాధింప దక్షుఁడొక్క కవిబ్రహ్మయే! పరపర చెఱుకుగడల పరుసును నఱకించి తత్తత్పాత్రలచే శత్రుహృదయ పుట భేదనము చేయింపగల యెక్కటికవి తిక్కనయే! ఇదేమి లెక్క? యుద్ధ పంచక రసప్రపంచమున నితని గంటపుగొన వెలిగ్రక్కిన నిప్పుకలు ఆగ్నేయాస్త్ర ప్రమాణములు.

తిక్కన పద్యములలోని తెలుగు పదములు విఱుపుమలపులు, పలుకుబడుల తగులుబిగువులు ఎల్లరకు సడలింప నలవికానివి. కొలికి పూసలెఱిఁగి విదిలింప

గలిగినవారికి భావవల్లరులు స్వయంప్రకాశములగును. అలతి యలతి పలుకు కళికల అనల్పార్థస్ఫూర్తిసరేసరి! అలవడిన చదువరికే ఆ గంభీరశబ్దాంత రాంతర భావ ప్రసారము ఈషదాలోచనామృతసారమై ఆస్వాదయోగ్యమగును. అందువల్లనే 'ముఖేముఖే సరస్వతీ' యన్నట్లు ఎందఱు విమర్శకు లెంతెంత చెప్పినను కొంతకొంత మిగిలియే యుండును. అటనట ఆయీ యర్థవైవిధ్యములును నంగీకృతములు కాకతప్పవు. ఇంతయేల? సామాన్యులకు పద్యము చక్షురక్షర సంయోగము కావచ్చును, కాని తత్‌క్షణోచ్చారణ సాధ్యము కానేరదు. అర్థము, తత్సమన్వయము, మనశ్చక్షుర్గోచరములైన తర్వాతనే ఎవ్వరైన తొలిసారి పెదవి విప్పి ఆయన పద్యము వినిపింప గలుగుదురు. కావుననే కాబోలు భారతము చదువగలిగినవాడే పండితుడని, భాగవతమున నర్థము చెప్పగలిగినవాడే పండితుడని - అనుభవజ్ఞులందురు. ఇది కవిత్రయములో తిక్కన పర్వముల నుద్దేశించియే యన్నమాట! తిక్కన పద్దెమొకటి సుగమమనిపించును; ఇంకొకటి తెలిసియు తెలియని దనిపించును; మఱొకటి దిగినకొలది అడుగడుగున అగాధమగుచుండును; వేఱొకటి పదము కదలుపగానే లోతు తలమున్కలగును. అట్టి పద్దెములలో ఒండురెండు ఇంచించుక ఇందు వ్యాఖ్యానించెద. మనము పట్టి తెలిసినంత పట్టు తెలియజెప్ప బ్రయత్నింతును. వ్యాఖ్యాత లొరయనేరని రత్నము లెన్నెన్ని కలవో! అవన్నీ త్రవ్వి వెలయింప నలవికానిపని.

"ఆ దుర్యోధను డంత మాత్రమును జేయంజాలడో కాని పెం
పేదం గ్రూరత కోర్వరాదు సిరి నాకేలందునే గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నా యరయు నీ చుట్టాలకుం గావున్
మోదం బందుట గల్గు కౌరవులు నేముం బొంది శ్రీ నందినన్!"

పాండవు లరణ్యాజ్ఞాతవాస సమయము సక్రమముగ నెరవేర్చికొని ద్రౌపదితో ఉపప్లావ్యమునకు జేరికొనిరి. ధృతరాష్ట్రుని పనుపున వచ్చిన సంజయునితో ధర్మజుడు కనీస మయిదూళ్ళిచ్చినచో గౌరవ పాండవులు పొంది పొసగి యుండవచ్చునని తెలిపెను, తదనంతరము ధర్మజుడు కౌరవసభకు శ్రీ కృష్ణునిచే రాయబార మంపుచు ఇట్లనెను: "ఇచ్చుటి బంధులు నీవును, నచ్చెరు వడి వినుచునుండ నయిదూళ్ళును మాకిచ్చినను జాలునంటిని! పొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ!" నిన్న సంజయునితో నేనేమంటినో ఆ మాటమీదనే నిలబడుదును. అయిదూళ్ళిచ్చిన జాలు ననియే కౌరవ

సభలో జాటిచెప్పుమని ధర్మజుడనినాడు. అ అయిదూళ్ళు కూడ వదలుకొని పొందిపొసగి యుండరాదా ధర్మజా!, రుధిరాభీలాన్నంబున కంటెను మేలగు భిక్షాన్నమైన మీనడవడికిన్ – అని సంజయునివలె శ్రీకృష్ణుడును ఛలోక్తికైన అనవచ్చుగదా? దానికి సమాధాన మీ పద్యములో నిక్షిప్తమై యున్నది.

ఆ దుర్యోధను ధీ అయిదూళ్ళిచ్చు సంధికి గూడ ఒప్పుకొననిచో, పెంపు నశింపజేయు క్రూరక్రియకు – అనగా యుద్ధమునకు నా మనసొప్పదాయె! యుద్ధమెందుల కందువా? సిరికోసము. సిరియెందులకందువా? నా అరయికలో నున్న చుట్టాలకు అన్న వస్త్రములు తీర్చుటకే! అందులకై శ్రీనొందుట విధి. అనగా, నేను కోరినట్లయిదూళ్ళయిన బొందితీఅవలె; అది తటస్థించినచో వారును మేమును పొందిపొపొసగి యుండవచ్చు! అంతతో ఎట్లోతృప్తిపడుదును, ఇది ఆ పద్యభావము.

“మేము ధర్మవిహితమైన రాజ్యభాగస్వామ్యము – అనగా అర్ధరాజ్యము కోరక, అయిదూళ్ళిచ్చినను జాలునని అడుగుచున్నాము. ఆ అయిదూళ్ళేవియందువా? లోగడ సంజయునితో పేర్కొని చెప్పినవే: 1. కుశస్థలంబు, 2. వృకస్థలంబు, 3. వాసంతి, 4. వారణావతంబు, 5. మఱి ఎందేనియు నొక్కటి గా మా యేవురుకు నిలువఠావు లయిదిచ్చిన సర్వశాంతి యగునంటిని. అది పొసగనిచో (పెంపేదన్) పెంపునశింపజేయు యుద్ధము తప్పదు” అని పాండవాగ్రజుడు సూత్రప్రాయముగ పలికినాడు. ఇక నశింపగల పెంపు ఎట్టిదో విచారింతము.

1. పెంపు = వంశప్రతిష్ఠ: తమ తాతభీష్ముడు “ఎన్నడేని పుట్టిన బుట్టవచ్చునను కొన్న తమ్మునకు సర్వరాజ్యస్వామ్యము గలిగించుటకై – తన భాగస్వామ్యము వదలుకొన్నాడే! అంతేకాదు, తాను వదలుకొన్నను తరువాతి తరములో తన కొడుకులు దాశరాజదౌహిత్ర భాగస్వామ్యమున కడ్డుతగులుదురేమో!” యని తాను నిత్య బ్రహ్మచర్యవ్రత బద్ధకంకణుడై ఆంబికేయసింహాసనమునకు దాస్యము చేయుచున్నాడే! “భ్రాతృ భాగస్వామ్య త్యాగమునకు బేరువడ్డ ఈ కురువంశము నేడు భాగస్వామ్యములకై చేయు పాండవకౌరవ రక్తతర్పణముచే కళంకితమగును కదా!” అని ధర్మజునిఘోష.

2. పెంపు = పాండురాజ ప్రతిష్ఠ: “ఆంబికేయు దంధుడైనను, ఆయనను గద్దెపై నిలిపి పాండురాజు తద్రాజ్య రక్షణకు బూని అన్న అడుగులకు మడుగులొత్తెనే!

ఆ సంప్రదాయము కొడుకుల తరముననే కళంకితము కానున్నదే!" అని పాండవాగ్రజుని చింత!

3. పెంపు = స్వప్రతిష్ఠ: "తానే ఆర్జించుకొన్న పేరు పెంపులు- చేతులార తుడిచిపెట్టకోవలసి వచ్చునే" అని అజాతశత్రుని అంతరాంతరబాధ. విదుర భీష్మాదుల ధర్మజగుణ ప్రశంసల కన్న పుత్రవ్యామోహితుడగు ధృతరాష్ట్రుని ధర్మజ గుణస్తుతి విలువలో మిన్నకద! "సత్యశౌచ ధర్మశాలి దయాపరుండట్టి ధర్మపుత్రు నాక్రమింప మనము దలచుటెల్ల మంటలో మిడుతలుదగ్రవృత్తి నుఱక దలచునట్ల" అని ధర్మజగుణశీలములకు వన్నెకట్టి సంజయునితో ధృతరాష్ట్రుడు పలికెనే! అట్టి ధర్మపుత్రునకు యుద్ధభీతి యుండదా? కావుననే స్వప్రతిష్ఠను యుద్ధప్రయోజనమునకు వినిమయ మీయ వెనుకాడెనన్నమాట!

4. పెంపు = అతిశయము, ఆధిక్యము: యుద్ధము దేశమున కనర్థదాయకము, 'ఏమిగతి దలంచినం బగకు మేలిమిలేమి ధ్రువంబు'. ఈ రాయబారపు సందేశముననే ధర్మజుడు శ్రీకృష్ణునితో యుద్ధప్రమాదములు వరుస పెట్టి చెప్పెను.

"కలహమగుట లక్ష్మిగారించుఁ బ్రాణహా
నియును జేయు నింత నిక్కువమ్ము
పలువురొకని కోడి పొఱుట బల్లిదు
లనద చేతఁ జెడుటయును ఘటించు."

"ఎల్లసొమ్ములుం బోవుటయుం గులక్షయము పుట్టుటయుఁ"
"జయమగు నోడుదు మను నిశ్చయ మొక్కడులేదు, వినుము,
సమరమున బరాజయము మరణము కంటె
హృదయపుట భేదనము సేయుఁ దథ్యం బనఘా!"

"పగయ కలిగెనేని బాము న్న యింటిలో
నున్న యట్ల కాక యూఱడిల్లి
యుండ నెటుల చిత్త మొకమాటు, గావుప
వలవ దధిక దీర్ఘ వైర వృత్తి"

"పగ యడగించు టెంతయు శుభంబగు...."

– ఇవి ధర్మజుడు తెలిపిన యుద్ధానర్థములు. అందుచేతనే 'పెంపేదఁగ్రూరత కోర్వరా' దని ధర్మజుడనుట. శ్రీకృష్ణుడింతతో ఆగలేదు. 'నాకు, నీకు, గులమంతకు నీ నృపకోటి కుర్వికిఁ బుట్టు మహాపద' అని, శ్రీకృష్ణుదు ప్రపంచక్షోభకిది కారణభూతమగును సుమా! అని ధృతరాష్ట్రుని హెచ్చరించెను. ఇవిగాక మనమును ఎఱిగిన అనర్థములనేకము లనుభవైక వేద్యములు. ధన మింకిపోవును. వీరులు మరణించి భీరులు మిగులుదురు. అనాథలగు భార్యలు, దిక్కులేని బిడ్డలు, జీవన్మృతులగు ముదుసలులు శుష్కించి దుర్మరణము లొందెదరు, అవినీతి సరేసరి! ఇంకెన్నేని కలవు. ఇన్ని యనర్థములకు మూలకందమైన యుద్ధము 'పెంపు'ను నశింపజేయుననియే అజాతశత్రుని ఆంతరంగిక బాధ.

'పెంపు' అన్న శబ్దమున కన్యత్రప్రయోగము లియ్యెడ గమనార్హములు, లేనియెడ ఈ పై వ్యాఖ్య నిరాధారము.

1. పెంపు = అతిశయము "కామంబు పెంపున గడగు గ్రోధంబు"
(భారతము – అరణ్య – 4 ఆశ్వా)

2. పెంపు = గౌరవము "నీ వూరకునికి పెంపని పాటించె దిట్టి బేలయుగలడే"
(భారతము – శాంతి–4 ఆశ్వా)

3. పెంపు = మహత్త్వము "మన కింతకంటెను పెంపెయ్యది"
(భారతము – ఉద్యోగ – 4 ఆశ్వా)

(రూపాంతరము)

4. పెనుపు = అతిశయము "పెనుపుం జతురత మెఱయగ"
(భారతము – ఉద్యోగ – 3 ఆశ్వా)

5. పెనుపు = ఆధిక్యము "పెనుపున నాకసం బనియు బృంహితముల్"
(భారవము – శల్య – 1 ఆశ్వా)

6. పెనుపు = మహత్త్వము "వినుము మహేశ్వర కర్ణుని పెనువు,
మహేంద్రుండు వచ్చి"
(భారతము – ఉద్యోగ – 2 ఆశ్వా)

'పెంపు' అన్న శబ్దమున కున్న అర్థావరణము ఇంత పెంపుగలది. ఇక 'క్రూరత'యో ఆ పదమెంత కటువో, దాని ఉద్దిష్టార్థమంత సున్నితముగ వాడబడినది, 'యుద్ధము' అన్న తెంపు మాట రానీయ వాయోడిన ధర్మజుని జాలిగుండెకు దగిన యర్థోక్తి యది. 'యుద్ధము'నకు బర్యాయపదము 'క్రూరత' యా-కాదు. పాత్రీకరణ శిల్పియగు కవిబ్రహ్మ యుద్ధమని వాచ్యము చేయింపక ఆజాతశత్రునిచే 'అబ్బా! ఆ క్రూరమైనపని' యని మాత్రమే పలికించినాడు. తిక్కన పదప్రయోగ కౌశలము ఆయా పాత్రల తత్త్వముల ననుసరించుటదేమి వింత? ఈ పద్యమున రెండవ పాదము నందు 'పెంపు'ను 'క్రూరత'ను ఇంచుక పట్టి విడచితిని. ఇక రెండు, మూడు పాదములలోని ధర్మజ వాద క్రమమును పరిశీలింపదగును.

"శ్రీ గావలె నంచు బోరితము గామియు గోరెద" మన్న ధర్మజ సూత్రమున కీ పద్దెమొక యుక్తి యుక్తమైన వ్యాఖ్యానము.

1. యుద్ధమున కోర్వరాదు 2. యుద్ధమెందులకా సిరికొఱకు. 3. సిరియెందులకా? చుట్టాల పోషణకు. ఇదికదా వాదక్రమము! మరి ఈ పద్యములలో 2. వ విషయము లోపించి 1,3 మాత్రమే కనిపించుచున్నవి. అది అధ్యాహారమైనదన్న మాట తిక్కన 'ఉఱుకు' వాదమునకు ఇది గుఱుతుకంబమనవచ్చు. గణితశాస్త్ర కృతహస్తుని బుద్ధివేగమున మధ్య మెట్లు....అధ్యాహారములైనట్లు తిక్కన బుద్ధి గమ్యకవితా వేగమున మధ్యవాదక్రమ మధ్యాహారమైనది. కవిబ్రహ్మ ఉక్తివైశిష్ట్యమునకు, యుక్తి వైభవమునకు ఈ పద్యమొకానొక తార్కాణం.

"అర్ధభాగ మిచ్చుట న్యాయము. అట్లు న్యాయమునకు కట్టుబడనేరండేని దుర్యోధనుడు నా అడిగిన అయిదూళులిచ్చినను జాలును. అదియును ఈయజాలడా, ఇక యుద్ధము తప్పదు. "యుద్ధము సర్వానర్థదాయకము గదా అది వదలుకోరాదా?" అందువేని శ్రీకోసమే యుద్ధము. శ్రీ నాకోసము కాదు. నా రాజబంధువుల గ్రాసవాసములకోసము" అని ధర్మజుడాడుటలో ఆయన ఆత్మగౌరవము చెడలేదు; ఔదార్యము, కారుణ్యము, బంధుప్రేమ, ముప్పిరిగొని కౌరవ సభాసదులనే కాదు, ఎల్ల లోకమును బిగింపగల బలము సంపాదించినవి. తిక్కన హృదయమును నిదియే!

తిక్కన హృదయము చొచ్చి చూడనిదే ఆయన పద్దెము పెదవి విచ్చి ఏ మొనగాడును చదువలేడనుటకు ఈ పద్యమొక నిదర్శనము. అందువల్లనే

వాగనుశాసనమని సూక్తికి బ్రసక్తి కలిగినది. "ఉచ్చారణ దక్షుచేత నభిహితంబైనప్పుడే శబ్దము ప్రాణవంత"మగును. ఈ సత్యము తిక్కన పద్దెములే నిరూపించును.

మఱొక్క పద్యము పరిశీలింతము:

"పగ యడగించు టెంతయు శుభం బది లెస్స, యడంగునే పగం
బగ? పగగొన్న మార్కొనక పల్కక యుండగ వచ్చునే? కడుం
దెగ మొదలెత్తిపోవఁ బగదీర్పగ వచ్చినఁ గ్రౌర్యమొందు; నే
మిగతి దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా!"

ఇంతకుమున్ను వ్యాఖ్యానించిన పద్దెములోని 'పెంపేదం గ్రూరత కోర్వరా' దన్న మూలసూత్రమున కీ పద్యము భాష్యమనవచ్చు. వెనుకటి పద్యము ఒక్క యుద్ధమే ఓర్వరానిదని తెల్పినది. ఈ పద్యము ఒక్క వైరభావమే అనేక యుద్ధములకు మూలమగునన్న క్రమ పరిణామమును వివరించినది.

వైరమును అణచుటే మంగళప్రదము. అంతకన్న మంచిది లేదు. వైరముచేత వైరము చచ్చునా? చావదు; పెరుగునుకూడ. దెబ్బతిన్నవాడు ఎదురుదెబ్బ తీయకుండ ఊరకుండ గల్గునా? అతడు దండెత్తిపోయినచో ఎదుటివానికి క్రౌర్యము పెరుగదా? యుద్ధము జరుగదా మఱి? ఎన్నిరీతుల ఆలోచించినను వైరభావమే మంచిది కాదనిపించును. కృష్ణా"అని ధర్మసూతి తేల్చిపలికెను.

ఆపద గడవం బెట్టగ నోపు శ్రీకృష్ణపరమాత్మను సంధిరాయభారమునకు బూన్చునప్పుడు అజాతశత్రువు తన హృదయమును విప్పి చెప్పవలదా? చెప్పెను. శాంతికాముకులగు రాజు లెల్లరకును ఇది సర్వథా అనుసరణయోగ్యము, శుభప్రదము; అందును సత్త్వగుణ సుందరునకిది సహజాలంకారము. ఇందేమాత్రమును విప్రతిపత్తి లేదు.

మఱి నిన్నటి సంజయురాయబారమున రుద్రరూపము దాల్చిన దితడుకాడా? "సంగ్రామంబు రాజులకు ధర్మం బవు, కాదని నీవు చెప్పు" మని సంజయుని తర్జించి గర్జించిన దీతడుకాడా? రాజధర్మ స్థాపనతో ఆగక సంగర వినోద లాలసునివలె నిప్పులు గ్రక్కి

గాండీవ జ్యారవం బుత్కటమయి పెలుచంగ్రమ్మినన్, భీము బాహా
దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగాఁదోఁచినన్, వే

దండ ద్వంద్వంబు మాడ్కిం గవలు మాద్యద్గతిం దాకినం, జా
కుండం బోకుండ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్లకుండన్?

అని సంజయుని గుండె లవియించిన దీతడు కాడా? అట ధృతరాష్ట్ర దూతకది యవసరము; ఇట పాండవదూత కిది యవసరము. ఏలయందురా? ఇప్పుడు సంజయ ప్రవృత్తిని ఇంచుక మన మెఱిగిననే కాని దర్మసూతి యుద్దిష్టార్థము తేటపడదు. సంజయుడు ధృతరాష్ట్రుని అంతరంగిక సేవకుడు.

'రుధిరాభీలాన్నంబున కంటెను మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్' అనియు 'మాకుం గుడుమిండిదె మీరు వ్రక్కఁగొనుఁ'దనియు చదురడిచిన సంజయుడే, యిలుచేరిన వెనువెంటనే ధృతరాష్ట్రునితో ఏమన్నాడు?

'దేవర పంపగాఁ జని యుధిష్ఠిరునిం గని వచ్చినాడ నా
భూవిభు డప్రమేయ గుణపూజ్యు"డనియు,

'సాధురేగె నేని
న్వీను తలపాలమునను గాని నిలువదుసుమ్మీ!' యనియు
'ధర్మసూతి మెత్తనిపులి, ఎల్లవారలు నధర్మము
నీపయి బెట్టునంతకున్ వినడును గానడున్, పిదప
నీకును నాకు గదల్పవచ్చునే?' అనియు
'బిడ్డలేని త్రిమ్మరియగు కొయ్యగాక
కుదుట గూడవెట్టి కుడుచువార
లిట్టి క్రొవ్విదంబులు సేయ జొచ్చు
టిచ్చగించి చూతురయ్య!' యనియు
'పుడమి జనంబులెల్ల నిను బ్రువ్వగ దిట్టగ విన్చునున్కి నొ
చ్చెడు మది యెప్పుడున్ చెవులు చీమలు కట్టెడు
కౌరవేశ్వరాయనియు

ప్రభువు చెవి నిల్లు గట్టుకొని అప్రియమైన హితము, జంకు కొంకులు లేక, తెగబడి చెప్పగలవాడు సంజయుఁడని ధర్మజుఁడెఱుగును. అంతేకాదు, ధృతరాష్ట్రుడు

పుత్రవ్యామోహితుడగుటచే భీమాదుల వలని భీతి రేబవళ్ళు మలమల మఱగువాడనియు ధర్మజుఁడెఱుగును. అట్టి ధృతరాష్ట్రునకు సంజయుడు అజాతశత్రుని ఉగ్రరూపము, ఉదగ్రతాండవము సాక్షాత్కృతము చేయుగాక! నయమున గాకున్న భయమున నైన ధృతరాష్ట్రుడు సంధికొడంబడునేమో అని ఆశించి 'గాంఢీవజ్యారవము, శుంభద్గదా చంక్రమణము' యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రునకు దలపింపజేసినాడు. అంతే! సంజయు నంపునప్పుడే ధృతరాష్ట్రుడు 'రుద్రునకునైన నోర్వరాని ధర్మపుత్రు కోపమునకు దలకవలె' అని చుట్లనున్నవారితో నన్నమాటయే కద!

భారతమున అంతుపట్టనివి రెండే పాత్రలు. ఒకటి ధర్మజునిది ఇంకొకటి ధృతరాష్ట్రునిది. ఒకడు మెత్తని పులి. ఇంకొకడు చిక్కని దొంగ. తిక్కన రాజకీయ రంగములో పాత్రీకరణ వైశిష్ట్యమిట్టి. అంతమున అధర్మ మోడి, ధర్మము గెలిచి శాంతము పర్యవశించినది.

అర్థగౌరవము, వాక్య సంగ్రహము, యుక్తివైభవము, ఈ పద్దెమున ముప్పిరిగొని శైలి బిగువు తేటినది. ఇంత వ్యాఖ్యానార్హమైన పద్దెమున అన్నియు ఒందు రెండక్కరముల అచ్చ తెలుగు పదములే కాని మచ్చునకైన ఒక చిఱుసమాసము కానరాదు. వాక్యము లనేకములు, యుక్తి కమ్మచ్చున దీసిన ఒకే ఒక తీగవలె సాగినది.

ధర్మజ సందేశ వాక్యములు ముగించునప్పుడు "అస్మాన్వేత్థ పరాన్ వేత్థ" అను మూలశ్లోక భావమున కదనముగ "పొమ్మెవ్వడ నీకు నేను బుద్ధులు సెప్పన్" అన్న ముక్తాయింపు కేవల సందర్భమున కత్తుటే కాక ధర్మజ లౌకిక ప్రజ్ఞకెంత మెఱుఁగిచ్చినది? అంతేనా? –

ఆపద గడవం బెట్టగ
నోపి శుభం బయినదాని నొడగూర్పను మా
కీపుట్టువునకు పాండు
క్ష్మాపాలుడు నిన్నుజూపి చనియె మహాత్మా!

అన్న పద్యము వ్యాస ప్రోక్తము కానిదే! కేవల కవిబ్రహ్మ సృష్టియే! శ్రీకృష్ణ భక్తిస్ఫోరకముగను, పాండుక్ష్మాపాల సమానస్థాన గౌరవ స్ఫోరకముగను, సమయోచిత రాజకీయ లౌకిక వాక్య ప్రారంభమకుటముగను, ఈ పద్దెమెంత ధర్మజ వినయ సంపత్తి కొన్ని మెఱుగిచ్చినది? ఇట్టి పలుకుబడులు ఈ మహాభారతమున నెన్ని వేలున్నవో!

మఱొక్క పద్దమున పట్టి విడుతును.

“తుది రాజ్యమ్ము సగమ్ముగొమ్మడవియందుం బేరు వంచించియుం
బదుమూడేడులు నీవునుం దిరిగిరా బాలీక పోవచ్చునే
యరి గాదేఁ దెగి బంటవై యఱుము మాయల్ వన్ను నేర్పింక జె
ల్లదుసూ నీకని యా సుయోధనుని యుల్లం బుచ్చిపోనాడుమీ”

ఇదియును శ్రీకృష్ణుని రాయబారపు ఘట్టములోని పద్యము. సహదేవసందేశమునందు దుర్యోధను నుద్దేశించి యత డందీయగోరిన కొసమాటయిందున్నది.

“అయిదూళ్ళను మాకిచ్చినను జాలునంటిని
పొచ్చెము గా దింతవట్టు పూర్ణము సుమ్మీ!”

అని ధర్మజు డొరవడి పెట్టెను. 'తు.చ' తప్పక ఆ ఒరవడి దిద్దికొని భీమార్జున నకులులు అగ్రజప్రతిపాదనమును బలపఱచిరి. సహదేవుడొక్కడే దానిని ఖండించి ప్రతిఘటించి, అర్ధభాగస్వామ్య ప్రతిపాదనము చేసిన జగజెట్టి. సహదేవ సందేశమనదగ్గ దీ పద్దెమొక్కటే! అంతకు ముమ్మనమూడు పద్దెములును భాగస్వాములగు అన్నదమ్ములయిదూళ్ళడుగు కొన్న దైన్యమునకై ఆవేదనము వెలిగ్రక్కినవి. సంధి ప్రయత్నమునే ఖండించి నాడు సహదేవుడు. “ఉచితమైనది కయ్యమే! కురుప్రవీరు సభ నిశ్చయమిట్టిది కాగ జెప్పుమీ!” అని కృష్ణునివైపు త్రిప్పిన సహదేవుని కనులకు దుర్యోధను డడ్డమైనట్టు తోచినది. సహదేవున కొదలు మండి ఇట్లనెను.

“ఓరీ సుయోధనా! నీవు ఇచ్చువాడవును, మేము పుచ్చుకొనువారమునా? మేమే నీకు సగముభాగ మిత్తుము. నీవు చేయి చాచి తీసికొనుము. మేము పదమూడేడు లరణ్యాజ్ఞాత వాసములు నెఱపి తిరిగి రాగా, మా రాజ్యము మా కొప్పజెప్ప వద్దా? ఒప్ప జెప్ప నేరవో రణరంగమున వీరమరణ మొంద సంసిద్ధుఁడవు కమ్ము! ప్రాతమాయలిక సాగనీయము సుమా!” అని సుయోధనుని గుండియ వ్రీలబలుకు మని శ్రీకృష్ణుని ముందు సహదేవుడు నిప్పులు కురిసెను.

భారతము నందెల్ల సహదేవ సందేశమునకు, అందును ఈ పద్యమునకు ఎంతో వైశిష్ట్యమున్నది. స్త్రీలలో కుంతీ ద్రౌపదులు, పురుషులలో సహదేవుడు పాండవ పక్షమున సంధి వ్యతిరిక్తులు. దుర్యోధన హృదయపుట భేదన దక్షములగు అచ్చ

తెలుగు చుఱుకు మొనలు ఈ పద్దెమున మఱింత పదనుతేఱి సహదేవ పాత్రత్త్వమును కెంతో సరిపడినది.

ఈ పద్యము శ్రవ్యమనిపింపదు. దృశ్యమై కనిపించును. కనిపింపని దుర్యోధనుని తన యెదుట నిలుపుకొని సహదేవుడు పలుకరించెనుపో! దుర్యోధనుని మన యెదుటకు లాగి సహదేవుడు నిగ్గదీసినిలిపి, మర్మభేదక వాక్యములను పిడికిలించి పొడిచి పలికినట్లు మనకును దృశ్యమాన మగుచున్నది.

'తుది' అని దుర్యోధనునితో తొలిగా పలుకరించి నిలువరించినాడు గదా సహదేవుడు! ఇదేమి వింత? ఇంతకుముందు అతనితో తానేమియు అనలేదే! –అవును. ఇక మాటలతో తనకుఁబనిలేదు. ఇదియే 'తుదిమాట' అనుటకు 'తుది' అని ముక్తాయించి పద్యము ప్రారంభించుట సంభాషణోచిత వైఖరికి మకుటాయమాన విధానము. నాటక రచనములలో గూడ ఇది అపూర్వ శిల్పమర్యాద! తిక్కన రచనలు శ్రవ్యములకు భరతవాక్యము, దృశ్యములకు నాందీగానము.

ఇంకొక ముఖ్యాంశమేమన, సహదేవుడు పిడుగులు గుఱిసిన వాక్కంతయు, అమూలము, అమూల్యము.

"రక్కెన మాటలాడెదరు రాజును దమ్ములు వానిలోన నీ
వొక్కటియైన గాదనక యూకొనుచుండుట యంతకంటె మేలు...."
"తలపంగూడునె యింతలేసి దొర లీ దైన్యంబు చుట్టంబులుం
జెలులుం దిట్టరె లాతి రాజులకు మెచ్చే యివ్విధం బిట్టిదింగలదే..."
"వీరలు ధర్మమార్గము సవిస్తరతం దగ నాడిరేనియన్
వారలు దాని కియ్యకొనివన్ వినుమచ్యుత యట్టి నంధి పెంపారగ
నేర్చునే..."

"తుదిరాజ్యమ్ము సగమ్ము గొమ్ము...."

ఈ పద్యములు కవిబ్రహ్మ కవితాసృష్టిలోనివే! ఇక్కమాటలో జెప్పవలెనన్న తత్తత్పాత్రోచిత నాటకీయ చేష్టా కాకుస్వర విలసనములు మహాభారత పర్వము అందెందొత్తి చూచినను ఎత్తిచూపినను మేల్తరమైనదెల్ల తిక్కనగారిదే! అందందెల్ల జాను తెనుగు పలుకు కుప్పలే! తెలుగు జాతి యింటిబాస మొదలు సాంఘిక రాజకీయాధిభౌతికాధ్యాత్మిక పారిభాషికాంధ్ర పదకోశములు అలవోకగా కవిబ్రహ్మ

విప్రుషములే! ఆయీ రిక్కగమి నెమ్మియని యేఱుకో గలము? పుల్లవడు, చెవులు చీములు కట్టుట, మెత్తనిపులి, ఉవ్వెత్తు, కోటరము, చిడిముడిపాటు, ఒత్తొరువు పుట్టదుగా వెడ వెడ యలుక పొడములు - వాయోడు- ఏలినమాటలు - ముక్కున నావి - చావడము - అడియరితనము - పొనుపడు - ఇవి సామాన్యములు.

పాత్రీకరణ- నాటకీయత

సీత: నిర్వచనోత్తరరామాయణ సీతా పరిత్యాగ సన్నివేశమిది: మనము సామాజికులము. ఆభిజాత్య గుణశీలస్థితి సముచితములగు భూమికాంగ రేఖా ముఖావయవలేపనాదులతో గంగాతీర తపోవనోపాంతరంగస్థలమున సూత్రధారి తిక్కన కన్పింపజేసిన మూర్తినిఁ జూతము-

"ఒక నారీతిలకమ్ము కాననములో నుద్దామశోకార్తయై
వికలాలోకన మశ్రుధారలును పృథ్వీరేణు లిప్తాంగమున్
ప్రకటాక్రందనమున్ వికీర్ణకబరీభారమ్ము వక్త్రాబ్జ శో
షక నిశ్వాస గమోష్మమున్ గల యవస్థం బొందగా నయ్యేడన్"

ఈమె సీత. పిడుగు వ్రేసిన యట్లైన శ్రీరామాజ్ఞ విని మూర్ఛవోయి ఒక కొంతవడికి దెప్పరిలిన సీత యీమె. అంతకు మునుపు, ఆజ్ఞ వినగానే జరిగిన పని గనునింతము.

తాలిమి కొలఁదుల బోవని
వాలాయపు దిగులు గుండె వ్రయ్యఁగదిరినం,
గీలెడపిన జంత్రముక్రియ
నేలపయిం బడియె మేదినీతనయ వెసన్

పడి మూర్ఛిల్లి, మగుడ నొక
వడికిం దెలివొంది, భాష్పవారి గమగవం
గడలు కొనుచుండ, వాతెఱ
దడుపుచు, వెలవెల్ల నగుచు, దుల్లడపడుచున్

పలుకుడికి పెద్ద ప్రొద్దా
కులదృష్టి మఱంది జూచు, కొండొక నవ్వుం,

దలయూచు, ముక్కు పై నం
గుళమిడు, వెఱగందు, వగలకుం గొలువిచ్చున్.

ఇంతవరకు నటీనటనా కౌశల్యమునకు లొంగునుగాక! సాధ్యమగును గాక!

సందియము వడ, విచారంబునకు జొర
మాఱు పలుక, నొండుమాడ్కి సేయ
వెరవుగాక పిడుగు వ్రేసిన యట్లైన
మాట కియ్యకొనుచు బోటి పలుకు.

అయినా అవాంతర మనశ్చాంచల్యమాన భావసంఘర్షణము సతీ వ్యాహారముఖము లగుటకు వీలగునా? లేనిచో, మనమా భావము లీ కనుగవవతో కందుమా? మన అంతర్వాణిని మేల్కొల్పి విందుమా? తిక్కన్న యింతకుమున్ను సవదరించిన బహిశ్చిత్ర రంగ ప్రదర్శనము వంటిదే యీ మనోభావ నివేదనమును! ఏమి చిత్రమిది? అక్షరమైన నాటక రంగమును మన మనోరంగమునఁ దీర్చి తత్పాత్రావస్థా చిత్రణముతో దోదూయమాన భావానుగుణ చేష్టాదృశ్య చిత్రణము ననుసంధించి, విలీన భావ మొక్కటే సార్వజనీన భావము చేసి మనలను కరుణరస తరంగిత గంగలో ద్రోసి వదలినాడు తిక్కనామాత్యుడు. అటు సీతాదేవి నడవిని ద్రోసి పోవు లక్ష్మణుని జూతము.

చని, యరదమెక్కి యల్ల
ల్లన పోవుచు, నిలిచి నిలిచి లక్ష్మణు డయ్యం
గనఁ బొరిఁ బొరి మరలి కనుం
గొనుచుండగఁ, గోమలియును గొందలపడుచున్

ఎట్టు లాందోళిత మానసిక భావ పరంపరలలో నూగాడు చున్నదో కందము! ఆ రంగము విజన ప్రదేశము! వినుట కెవరున్నారు? అది అరణ్యరోదనము! "క్రూర మృగ సంకుల భీకరాటవిలో కోయని పిల్వ ఓ యని పలుకువారు లేరే?" అని ఘోషిల్లెనా సీతామహాసాధ్వి? లేదు. – "ఇతః పూర్వము నా వనవాస గమనము శ్రీరామచంద్ర సహధర్మ నిర్వహణ గౌరవము నందినది. భర్త చెంతలేని యిల్లాలికి గౌరవ మెక్కడిది?" – "ఇప్పుడొంటరి దానవై యేల వచ్చితి వమ్మా" అని అడిగిన వారి కేసమాధానము చెప్పగలను? భర్త ఒల్లని నాదురవస్థ ఎవరితో జెప్పుకొని దుఃఖోపశమనము గావించు

కొందును! భర్త ఒల్లని కారణ మడిగిన వారికి తప్పెవరిదని చెప్పుదును? - ఇత్యాది మానవతీ సహజ మనోభావములు తీగసాగినట్లు పొటమరించివేకాని, ముందుగతి యేమన్న భావమొక్కటియైన తోచినదా ఆ మహాసాధ్వికి? కథన మాత్రమున వక్ష్యార్థ మందించి ముందునకు సాగు లక్షణము తిక్కనగారి కసంతృప్తికరము. గంటము కదపి నప్పుడెల్ల తనకు సాక్షాత్కృతములగు పాత్రల రూపరేఖలు, అవస్థా భేదములు, భావపరంపరలు, సాత్త్వికానుభూతులు స్వానుభవసిద్ధములు చేసికొని అవియెల్ల పఠితృహృదయమున పునస్సాక్షాత్కృతములు చేయుట తిక్కన ఆదర్శము!

అంతేకాదు, నిష్కళంక యగు సీత లోకాపవాదకళంకిత యైనప్పుడు కూడ అగ్రహావేశము ఆమెలో తలసూపనీయలేదే! నిందామూలముగాని, నిందాఫలముగాని గర్హించి సత్యధర్మ విచికిత్స సాగింపలేదే ఆమె!

"అగుగాక! యట్లు చేసెద,
జగతీపతి పనుపు సేసి చనునీవును."

అన్నది. ఏమి గాంభీర్యము!

"జనపతికి నింక నేనే
మని చెప్పిన నేమి యగును? నదికడచనె"

అన్నది. "నిన్నటి వఱకే నే జెప్పుట, తాను వినుటఁ ఇక నాకర్హత యేది?" అని వాచ్యార్థము.

"నాకు నెఱుగజెప్పి పొమ్మనుటకుం దగనే"

అన్నది. ముఖాముఖిని నా శిక్ష నేను వినుటకైన నోచుకోలేదా? విని కొంత మనసు సమాధానపఱచుకొని వెడలెడి దాననే!

"కానిమ్ము నాకు జెప్పిన
కానియ కా, దధిపు పనుపు కడతేర్పగనే
బూనిన పని యిది."

అన్నది. చెప్పినను చెప్పకున్నను, తన నిందమాపు బాధ్యత నాది కాదా! నేనే పూనుకొని వత్తునే!

"అతని పంపానర్చుటయ కాదె ధర్మమ్ము నాతి కరయ"
అన్నది. భర్త ఆనతి భార్య తలదాల్చవలదా? భార్యాధర్మ నిర్వహణార్థమై అవశ్యము వచ్చెడి దానను గదా!

తిక్కన గారి చేతి సీత అనసూయాదులను మరపించిన మహాసాధ్వి. శ్రీరాముని ధర్మమూర్తి నతకరించి అయోనిజాత ఆదర్శధర్మస్వరూపిణియైనది. ఆపదలే సత్యధర్మములకు పరీక్షాస్థానములు. కావ్యపాత్రీకరణము కవి పాత్ర నాశ్రయించును.
"సృష్టినిలుకడ కర్తృ సంస్కృతిని గలుగు."
ఆంధ్రమహాభారతమున ద్రౌపదిని దిలకింతము.

అదంతయుఁద్రేతాయుగ రంగము. ఇటు తిరిగి ద్వాపారాంత రంగమునకుఁ జూపు మలపుదము. అది ఉపప్లావ్యము. ద్రౌపదీ సహిత పంచపాండవుల మధ్య శ్రీకృష్ణుడు పరివేష్టితుడు. ధర్మనందనుడు కుఱిసిన వడగళ్ళు భీమార్జున నకుల లేరుకొని తేఱుకొనగా, సహదేవుడు పిడుగులు రాల్చి రంగముడికించినాడు. ఇక ద్రౌపది అందుకొన్నది.

అంతలు సేసి పోనడచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె యిట్టి యూఱట? మదిం బ్రియ మందె యుధిష్ఠిరుండు; దా
నంతన యూళు లేవురకు నైదు సుయోదను డిచ్చునొక్కొ; ఈ
కంత కృపావిహీనమతి నాతడు నేచునె అన్నదమ్ములన్ ?

పాప మీరాజు 'రారాజు తమ్ముడు గదా' అని కనికరించి తన మునుబడ్డ బన్నములు మఱచిపోడా మఱి? బాగుగ నున్నదిలే! ఈ తీఱున మన ఐదూళ్ళ యాచనకు వారే దయయూచి యొప్పుకొన్నచో 'పాండువులెంత తెలివి తక్కువ వారు! ఎంత అసమర్థులు! సిగ్గులేదా? ఛీఛీ' అని లోకము వాకొనదా? మన పెంపు మనము గంగలో ద్రొక్కి, ఇంత న్యూనతకుఁ బాల్పడ నేల? పాఱ జూచినచో, సంధి, వారికే మేలు. బలాబలములే తూచుకొన్నచో మనము వారిని గెలువజాలమా? యుద్ధము చేయనే తలచినచో, మన మది విరమించుట యేల? కీడు చేసినను కనికరింపబడఁదగిన బ్రాహ్మణులా వారు?

సంకోచ మనునది సుయోధనుని బుద్ధికి పుట్టనే పుట్టదు. నీ హితము ననుసరించునా? వాని బుద్ధి మరలునా? మీదు మిక్కిలి ఉన్న దురభిమానము మఱింత పెరిగి బిరుసెక్కును సుమా? మనమే మొగ్గవలసినది యుద్ధమునకు! అది విరమించి చేతులు ముడిచికొని మనము మూల కూర్చుండగా, వారే అందులకు ముందడుగు వేసిన చొప్పులు విన వచ్చినవి. "ఇప్పుడైనను, పోటున కిచ్చుగింతుమా? లేక మరల అడవుల దలదాచుకొందమా?" అన్నదే యిప్పటి సమస్య. 'నేనిటు లంటిని గదా!' అని నొచ్చుకోను వలదు. అనుసరింపను వలదు. నా మాటలే మీకు శాసనములు కానక్కఱలేదు.

కృష్ణా! నీవును ఈ రాజుగారును, దమ్ములును సముచిత కార్యమార్గమును, మీ మంచితనమును మొక్కవోకుండ, నేరుపు తీరుపులకొలది, మీకు బోలిన తెఱగున నిర్ణయించుకొని, గురువర్గముతో సంధిపొసగించుకొనుడు. నా మాటలకు విలువ యే మున్నది?

నా పలుకులు పొల్లగునో ఫలించునో, యెఱుకలేని మాఱట నోరి దాననై ఉండబట్టలేక, మాటలు చిక్కఁబట్టలేక, కాఱులు ప్రేలితిని, కార్యాకార్యము లెఱుగని మూఢురాలను నేను! అల్కగొన్న అవివేకికి వివేక ముండునా? - అని ద్రౌపది ప్రారంభించినది - వక్తవ్యాంశము.

సహదేవుడు కుఱిసినవి పిడుగులు, ద్రౌపది చేబట్టినది బడబాగ్ని. "వంకమాటలేనేర" నని నిశ్శంకముగ పుడమి విడులఁ బిడుగులు రాల్చినాడతడు. ఇది ద్రౌపది సముద్రపు టొడింగట్టిన కార్చిచ్చు. దిగంత జ్వాలాజ్వలితమగు ఈ కార్చిచ్చేముఖమున బయనించునో చూతము.

ఇంతవఱకు ద్రౌపది యాడిన మాటలు కర్తవ్య నిర్ణయ విషయకములు 'సంధియా, సంగరమా' అని, అంతవఱకు ధర్మజుఁడితికర్తవ్యతా వక్తవ్యావకాశము ఆంతరంగిక పాండవసమావేశమున కీయలేదన్నమాట!

"సంజయుడు దన్ను వీడ్కొని చనిన ధర్మ
సుతుడు మఱువాడి తమ్ముల సుతుల నిష్ట
భృత్యవరులను దొరలను బిలువబనిచి
యెల్లవారును వినుచుండ నిట్టులనియె"

"మనము జనార్దను పాలికిఁ
జని కౌరవ సభకు నతని జనుమని ప్రార్థిం
చిని మేలు - బంధుహిత గురు
జనములతో రణముగాక సంప్రీతియగున్"

అని పలికి వారలందఱు బలసి చనుదేర మాధవు మందిరంబున కరిగి యతని చేత సత్కృతుం డయి సమస్తపరిజనంబులుం బరివేష్టింప, నొక పార్శ్వంబునఁ బాంచాలియు సముచిత పరివార పరివృతయై యుండ, నతండును దారును సుఖాసీనులై యుండి యతనితో నిట్లనియె!

"సమయ మిది మిత్రకార్యంబు చక్కజేయ
నీ కతంబున నే మవినీతుడైన
యా సుయోధనుతోడి పోరాట దక్కి
యనుభవింతుము మా యంశమగు ధరిత్రి"

దీనిని బట్టి కర్తవ్యనిర్ణయ బాధ్యత ధర్మనందనుడే వహించెనని కనిపించుచున్నది. సోదరప్రీతికై సమస్తజనము, పరిజనము వినుచుండఁ దమతమ సంధి సందేశములు శ్రీకృష్ణునకు వినుచుటే ధర్మజుని రాజకీయ విధానము. "ధర్మనందనుడు ఈ ప్రకారము సాహసించుట ధర్మమా? మున్నెవరిని నడుగక శకునితో జూదమాడ గడగి తద్దుష్ఫలిత మందఱకుఁ బంచి పెట్టినట్టే గద యిదియును?" అనియా ద్రౌపదీ సహదేవుల తాత్పర్యము? యథాతథముగ నీ భావమే కాకపోవచ్చు. సహదేవుడు ధర్మజున కవిధేయుడు కాడు. విప్లవకారుడును కాడు. అట్లే ద్రౌపదియు పతిభక్తి విరహిత కాదు; గయ్యాళియు కాదు. మీదుమిక్కిలి అతిపతిభక్తి పరవశ కావుటనే, పతిహిత నివేదనమున 'హితం మనోహారిచ దుర్లభం వచః' అని కాఱులు ప్రేలితినని యొప్పుకొన్నది. నిన్నను మొన్నను ధర్మనందనుడు కంకుడై విరటుని గొలిచినప్పుడీ ద్రౌపది ఏమని ఘోషించినది?

"అట్టి మహాత్ముఁ డొక్కనికి నాశ్రితుడై వెడగూడు జీరయున్
బెట్టగనిల్చి, వాని మదిప్రీతికి నీడగువృత్తి, బేరునుం
బుట్టును మాలి యిప్పుడిటు బ్రంగుడుపాటునఁ బొందఁజూచి నా
కెట్టు మనంబు పట్టు ధృతి యెమ్మెయి దూలక నిల్చుఁజెప్పుమా?"

అప్పుడివి విన్న భీముఁడే నీళ్ళకుం బల్చనై కరగికరగి మలమల మఱగెనే! యాజ్ఞసేని పతిభక్తి మానవము కాదు, దైవీ సంబంధి. మఱి, అట్టి ద్రౌపది యిట్లలాడుటం బట్టి ధర్మజుడే తప్పిదు డన్నమాట? అదియును గాదు.
శ్రీకృష్ణుని రాయబారపు నియుక్తిలాంఛన ప్రాయముగ నేడు ధర్మజప్రోక్తమెనదే కాని - అది విన్న సంజయునితో శ్రీకృష్ణుడు-

ఏ నీ పనికై వచ్చెద,
దానొప్పఁ దలంచె నొండె తప్పం దలచెన్,
దానన నెగడెద మే, మా
మానవ నాధునకుఁదెలుపు మా మతమెల్లన్

అని, స్వయముగా బూనుకొన్నదే!

ఏల? దుర్యోధనాదు లనార్యసంబంధముచే కృష్ణ తత్త్వమునకు వ్యతిరిక్తులు. కాపాలిక మతముఖ్యుడైన జరాసంధుని ధర్మజరాజసూయమునకు బూర్వమును, తదనుయాయియు, తత్సన్నిహిత సంబంధియు నగు శిశుపాలుని రాజసూయ ప్రారంభమునకు, రూపుమాయజేయుట ఆర్యధర్మ సామ్రాజన్యస్థాపనకే! ఆ రాజసూయము కారణముగా నీసుగన్నవారు దుర్యోధనాదులు. వీరిని గడతేర్చుటకు తనకు ప్రత్యేక కారణము దొరకలేదు. ధర్మజ సామ్రాజ్య స్థాపనలో ధర్మస్థాపన ఇమిడియున్నది. సామములేని దండనీతి అక్రమము. అందులకే దుర్యోధన జ్ఞాతివైరమున సందు చేసికోఁ దలచి శ్రీకృష్ణుడు ఈ రాయబారము కోరి చేపట్టినాడు. 'ఏ నీపనికై వత్తు'నని సంజయునిలో అన్నదందులకే!

ఇట్టియెడ రాయబారపు ధర్మజ ప్రతిపాదనము శ్రీకృష్ణుని నిర్ణయమును గౌరవించుటకే! కాని 'నీవు స్వయముగ బూనుకొన్నదే యిది! కృష్ణా' అనుటకు అలౌకికుడు, అనాగరికుడు, అహంకారి కాదు ధర్మజుడు. మఱిధర్మజుడు నిర్దోషియైనప్పుడు ద్రౌపది పలుకులలో నీ ములుకు లేల గ్రుచ్చుకొనుచున్నవి? ఔను, సందర్భమట్టిదే! విషప్రయోగము, ఆశీవిష ప్రయోగము, జలప్రమాద ప్రచోదనము, లాక్షాగృహ దహనము, మాయాద్యూత నిర్వహణము, సభాముఖపట్టమనిషీ పరాభవము. ఘోషయాత్రా సన్నాహము - ఇన్ని దుష్కృతులకు తమ్ము క్షమాభిక్ష యడిగి, కటాక్ష

మార్జించి, గ్రహించిన రాజ్యము సమయపూర్త్యనంతరము క్రక్కవలసినవాడు దుర్యోధనుడు. వారు చేసిన దౌష్ట్యములు క్షమార్హములు కానప్పుడు మేముచేసిన శపథములు సార్థకములు చేసికొనుటకు యుద్ధబంధకంకణులమై ఉఱకవలసినది మేము! ఇట్టి బాధ్యతలు తలక్రిందులయి విహిత రాజ్యభాగమే అయాచితముగ వదలుకొని అయిదూళ్ళిచ్చిన c జాలునని వారిని యాచించుటకు మనమే పోవలెనా? ఈ మాటయే సారాంశముగ ద్రౌపదీ సహదేవులన్నారు. ఇందు తప్పేది? ఎవరిది? అదే చిదంబర రహస్యము. అట సీతా మహాసాధ్వి భర్తృపరిత్యక్తయై నోరు మెదపకుండుటకు పతిభక్తియే మూలము. ఇట రక్తఋణ గ్రస్తులతోడి సంధికై భర్త లొడంబడుచున్నప్పుడు యజ్ఞసేని మండిపడుటకు పతిభక్తియే మూలము. ఇదే కవిబ్రహ్మ పాత్రీకరణములోని ధర్మ రహస్యము. రావణాసుర సంగ్రహీత యైన సీత హనుమద్దూత నేమడిగినది? శత్రుసంహారము. ఇట ద్రౌపదియు అంతే!

అంతేకాదు, సీత పృథ్వీపుత్రి; యాజ్ఞసేని అగ్ని దేవప్రసాదము. ఇరువురుకు ఆదర్శధర్మములు సమానము. ప్రకృతులు వేఱు. ఇదియే కవిబ్రహ్మ రచనాశిల్పము. కవిబ్రహ్మ యీ తత్త్వభేద చిత్రణమునకై ద్రౌపదీ చిత్రమును ఎట్టి విచిత్రరేఖలతో సమావేశరంగమున సాక్షాత్కృతము చేసెనో చూతము. వక్తవ్యకర్తవ్యాంశము, అనగా "సంధియా, సమరమా" అన్న మూలప్రాతిపదిక తడవి వదలి ద్రౌపది గద్గద కంఠియై తన వ్యక్తిగత స్థితిగతులు, తానుమున్ను పడిన భంగపాట్లు, సంతాపము, శ్రీకృష్ణునకు మొఱపెట్టుకొన్నది.

"ఎట్లును సంధి కృతనిశ్చయము గాన ఇదిగో వినుము. వరమున బుట్టితిని, భరత వంశము జొచ్చితిని. అందున బాండు భూవరునకు గోడలననిసించుకొంటిని. లోకపూజ్యులకు భార్యనైతిని. నీతివిక్రమస్థిరులకు పుత్రుల బడసితిని. తాదృశులగు సోదరుల కక్కనైతిని. ఇదంతయు నొక్కయెత్తు; కృష్ణా; సుభద్రకంటె గడునెయ్యమేకాదు, గౌరవస్థానమును నీ వల్ల బొందు యోగము గంటిని. ఇట్టి నన్ను, అనామకుండొకడు - వాని పేరుచ్చరింపను- జగజ్జేగీయమాన రాజసూయావభృతస్నాన పరిపూత వేణీభరమున వ్రేళ్ళనిరికించికొని సభ కీడ్చితెచ్చెను. ఇది అతిసామాన్య కులాంగనకైన ఓర్వదగిన పరాభవ మందువా కృష్ణా! అట్టి ఆ సభకు భర్తలతాకైన నోర్వరాని యేకవస్త్రను, పతులైదుగురుండి వారెల్లరు నా యాసలే వదలుకొని కొయ్యవాఱి రేఖామాత్ర చిత్రములై

మిన్నకుండగా, 'అన్యథా శరణం నాస్తి' యని నిన్నేకదా నా మనస్సు కొలువ వచ్చినది కృష్ణా; తెలియమి వలన భరతవంశపు గోడలిని వారు దాసిగ మార్చినారు గాక! ధృతరాష్ట్ర భూపతియింట దాసులై నాపతులు చన నున్నచో వారి వెంట నంటి పోదగిన నేను ఆ మామగారికిఁ గోటరము చేయబోవలెనో? లేక దాసినై యిలుతుడువ వలెనో నీవే నిశ్చయింపుము కృష్ణా" అని ద్రౌపది మాటాడుచుండగనే కంఠము రుద్ధమైనది. ఇక మాట పెకలలేదు. మాట స్థానమును చేష్ట ఆక్రమించినది. కుడిచేత గ్రొమ్ముడి కొసపట్టి లాగినది. ఆ చేత పొడవున సాగి మిగిలిన వెంద్రుకల కొసలు వ్రేలాడుచున్నవి, అప్పుడు తనతల నల్ల త్రాచుపాముపడగ. వ్రేలాడి కదలాడు వెంద్రుకల కొస లసితచ్ఛవి బొల్చు భుజంగ పుచ్ఛరేఖలు. తోక త్రొక్కిన త్రాచు యాజ్ఞసేని, చుట్టచుట్టుకొని పడియున్న పాము కసిగొన్నది. ఇప్పుడు బుసకొట్టుచున్నది.

ద్రోపది బంధురమ్మయిన క్రొమ్ముడి క్రమ్మన విడ్చి, వెంద్రుకల్
తా వలచేత బూని, యసితచ్ఛవి బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలగ, మనంబున బొంగు విషాదరోషముల్
గావగలేక భాష్పములు క్రమ్మగ దిగ్గనలేచి యార్తయై!

గోవిందు ముందట నా కేశపాశము పెట్టినది.

ఇవి దుస్ససేన వ్రేళ్ళం
దవిలి సగము ద్రెవ్విపోయి, తక్కిన యవి, కౌ
రవుల కడఁదీఱు మాటల
యవసరమునఁ దలపవలయు నచ్యుత వీనిన్!

"దుస్ససేనుడు మున్ను చేతఁబట్టి గుంజినపుడు, సగము పొడవులు తెగి, వాని గుప్పిలిలో నిరికినవి; తక్కిన సగముపొడవు వెంద్రుకలే ఇవి!" అని కృష్ణుని యెదుట పెట్టినది - యాజ్ఞసేని. కసిగొన్న త్రాచు ఎంతపొడవు తోక తెగిన అంత బుస్సకొట్టుచు ముందున కుఱికి, త్రొక్కినవానిపై బడును.

"ఈ వెంద్రుకలు వట్టి యీడ్చిన యా చేయి
తొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింతలింతలు తునియలై చెదరి రూ
పఱియున్న గని యుడుకాఱుగాక!

యలుపాల బొనువడు నట్టి ‘చిచ్చే యిది?
పెనుగద పట్టిన భీమసేను
బాహుబలంబును బొటించి గాంఢీవ
మను నొక విల్లెప్పుడును వహించు

కట్టి విక్రమంబు గాల్పనే యిట్లు బ
న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పీనుంగు గన్నారఁ
గానఁబడయ మైతి మేనిఁ గృష్ణ!”

‘ఈ తెగిన వెంద్రుక కొసలు లక్ష! ఆ చేయి లక్ష వెంద్రుకలను క్రొమ్ముడి నుండి విడివఱచి త్రెంపినది కాన, ‘చక్రవడ్డీ’ లెక్కగట్టి ఆ తనువెల్ల లక్షచిద్రుపలు (ఇంత లింతలు) కాగ తఱిగి విసరగా నేనని చూడవలె! అంతవఱకీ యొడి గట్టిన చిచ్చాఱదు. భీమునకు పెనుగద భుజాలంకారము. వివ్వచ్చునకు విల్లు ఒడలి కలంకారము. ధర్మజుడు, నేను రాజరాజు పీనుగును జూడగలుగ జేసినప్పుడే ఆ సాధనముల సార్థక్యము. లేకున్న భీమబాహుబలము. కట్టి విక్రమము కాల్పనా?’ అని ద్రౌపది అడిగినది. ఆ సాధనముల, ఆ బలపరాక్రముల నతిక్రమించినవి యాజ్ఞసేని పలుకుచిచ్చులు!

నెట్టన యట్టి యల్క మది నిల్పితి రక్కెస తాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు పెద్దయును గాలము, దీనికి నాఱు టెన్నడుం
బుట్టదు, దుష్టవిగ్రహము పూని జగమ్ములు గాచునట్టి తోఁ
బుట్టువు నీవు, దేజమున గల్గిన భర్తలు గల్గ నచ్యుతా!

అనుచు నెలుంగు రాలుపడ నేడ్చినది యాజ్ఞసేని. ఆమె నూరార్చి కూర్చుండ జేసి స్వయముగా కన్నీరు తుడిచి వెన్నెఱివేని ముడిచి శ్రీమన్నారాయణుడు పలికిన దేమని? “నేనున్నాను. ధర్మజుని పంపున వృకోదరార్జునుల తోడున శత్రు సంక్షయము నేను చేసెదను. పిచ్చితల్లీ! ఈ సంధి ఫలవంతమై కౌరవులుర్వియిత్తురా? ‘ఈయకున్న సంధి సున్న’ యనియేగద ధర్మజుడాడినది, నే నాడబోవునది!

లలనా యడుగుము నీ యే
డ్పుల కొలదియె కురునీతపాల పుత్రకళత్రం

బుల యేడ్పు ! లింక వానిం
గలకల నవ్వుచు వినంగ గాలంబయ్యె
మొదల విధి నియతియు అట్టిద!
పూని పలికెద వినుము రిపుక్షయంబు
జేసి యుజ్జ్వల పుణ్య లక్ష్మీసమేతు
లైన పాండు కుమారుల యధిక విభవ
మీవు సూచెదు తడవులే దిది నిజమ్ము!

అని శ్రీకృష్ణుడభయహస్తమిచ్చెను. ద్రౌపది యూరడిల్లెను. ఇంకేమి కావలె! ఎవరికేది కావలె అది వచ్చినది. రోగి, వైద్యుడు, పాలే కోరిరి. ధర్మజాదులకు పాలు రాలేదు; ద్రౌపదీ కృష్ణుల శాపాలు ఫలించి సమరమే సన్నిహితమైంది. ధర్మజుడు, దాను, రాజరాజుపీనుంగు గన్నార జూడగలిగినారు. 'అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్'!

అక్షరరూప పాండవ సందేశములకు సహదేవవాక్కు తలకట్టు! ద్రౌపది వాక్కుచ్చైస్స్వరము. శక్తి స్వరూపిణి యాజ్ఞసేని. కవిబ్రహ్మ ద్రౌపదీ పాత్రీకరణ సాక్షాత్కృత రాజకార్య వ్యవహార వివేక వ్యాహారోప సంహార ప్రకారము, కృష్ణావతార దుష్టసంహార శిష్టరక్షణ మూలకందమని నిరూపించినది. కించిత్కాలోదంచ ద్ద్రౌపదీ పాత్రచిత్రణ మింత ప్రభావంతమై దృశ్యరూప శ్రవ్యమో శ్రవ్యరూప దృశ్యమో కనివట్టరాక పఠితృ హృదయక్షేత్ర రంగమును గావ్యరనతరంగితము చేసి యూగించి యుక్కిరి బిక్కిరి చేసినదిగదా! ఆంధ్ర మహాభారత కురుక్షేత్ర సంగ్రామ రంగమునకు శ్రీకారము చుట్టినదీ ద్రౌపది వాక్కు.

ఆంధ్రమహాభారత రచనమున గవిబ్రహ్మ రూపించిన పాత్రోచిత సందర్భానుగుణ మనోభావ ప్రసారములగు పలుకులు, పలుకులలో ములుకులు, ములుకుల పదను, పదనుల వెలుగు జిలుగులు - వీని కనుగుణముగ ప్రత్యక్షములగు పాత్రల గాత్రచలనములు, ముఖరేఖలు, హస్తవిన్యాసములు, కంఠస్వరములు, ఉచ్ఛ్వాస నిశ్వాసములు, నవ్వుపువ్వుల నామరూపములు, కోపతాపముల చూపుకోపులు, సాంద్రఘర్మ సలిలమ్ములు, దంతపీడన రటనములు, వికటభ్రుకుటీ చటుల ప్రవర్తనములు

– ఇన్నియని యడుగడుగున లెక్కబెట్టనగునా? కవిబ్రహ్మ సృష్టిసంచారములోని అడుగడుగు ఒక సముద్రగర్భము: ఒక నందనవనము! ఒక అమృతకుంభము! ఒక వసంతము.

కవిబ్రహ్మ ద్రౌపదీ పాత్రీకరణకు సంస్కృతభారత మూలముండియు లేనిదే యనవలె; ఈ పలుకుబడి యొడుపులు, కాకువులు, ఈ సంవేదవేగము, యుక్తి ప్రాగల్భ్యము, ఈ చేష్టాదికములు, దృశ్య వైశిష్ట్యములు మూలమున గానరావు. కేవలము తిక్కనగారి నాటకీయ విధాన మూలములే ద్రౌపదీ సహదేవుల పాత్రీకరణములు. ఏబది శ్లోకముల మూలము, ఇరువది యైదు పద్దెములనిగ్గుగా తేటి ద్రౌపదీ పాత్ర రూపొందినది. అనల్ప కల్పనా శిల్ప చాతురీధురీణునకు వస్తువు నిమిత్తమాత్రము, భావనయే మూల సూత్రము.

మూలమున మూడు వందల శ్లోకములు విస్తరించిన పాండవుల సందేశ వాక్యము లొక్క వంద పద్దెములలో గుప్పిలింప బడుటయే గాక అనన్య లౌకిక రాజకీయ వ్యావహారవిహారము చేసి యయ్యైపాత్రలకు విశిష్ట రూపములిచ్చి మన కనులముందు నిలబెట్టినవి. ఈ ప్రకారము పదునేను పర్వములును తొలి మూడు పర్వములతో సంవదింపఁజేయుటటుండ, ఆద్యంత కథానుగత సూత్రీకరణమునకుగాని, విశిష్ట ప్రకృతిమూల పాత్రీకరణమునకుగాని, పాత్రోచిత వ్యవహార సంభాషణ వైఖరులకు గాని వైవిధ్యములు వైరుధ్యములు దొరలకుండ ఒక్కొక్క ఆశ్వాస మొక్కొక్క దృవ్యకావ్య మనిపించి తీర్చిదిద్దిన తిక్కనామాత్యుడు తెలుగు కవులకు వెలుగుకంబము; తెలుగు బాసకు నడ నిగంటువు; రాచవాచవులకు కోటబురుజు; లోవెలుగు తెన్నులకు విజ్ఞాన కోశము.

✦ ✦ ✦

Blank Page

ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించ డానికి చర్యలు చేపట్టడం.

తెలుగును పాలన, బోధన, ప్రసార మధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.

- తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం
- తెలుగు జాతి చరిత్రపై భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారు చేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు నేలపై గల చారిత్రిక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం **తెలుగు సంస్కృతి ప్రకాశం**

దేశ భాషలందు తెలుగు లెస్స